
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
గురువారం 2 జనవరి 2025





అశోక్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు

సంక్షేమం.. అభివృద్ధితో సుపరిపాలన

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఆరు నెలలుగా సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా సుపరిపలన సాగిస్తున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం నూతన సంవత్సరం పురష్కరించుకొని స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు వచ్చి తనకు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ 2024లో రాష్ట్రప్రజలు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పుతో చంద్రబాబు నాయకత్వంలో ఏర్పడిన ప్రభుత్వంలో అందరం ప్రజల ఆశలు నెరవేర్చేలా అహర్నిశలూ పనిచేస్తున్నామన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ద్వారా ప్రతి ఇంట్లో ఒక ఉద్యోగ అవకాశం కల్పించే దిశగా బాటలు వేస్తున్నామన్నారు. పేదవారి భవిష్యత్‌కు భరోసా ఇస్తూ పింఛన్‌ల మొత్తాన్ని పెంచడమే కాక ప్రతి ఇంటికీ ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్‌లు అందజేస్తున్నామన్నారు. ప్రయాణం సాఫీగా సాగాలని రాష్ట్రంలో గుంతలు లేని రహదార్లను వేస్తున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు చేశాక నగదును 48 గంటల్లో రైతులకు చెల్లిస్తున్నామని చెప్పారు. అధికారం చేపట్టిన ఏడాదిలోపే ఎన్నికల హామీల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడం ఒక్క చంద్రబాబుకే సాధ్యమన్నారు. అంతకుముందు మంత్రి శ్రీనవాస్ విజయనగరంలో అశోక్‌గజపతిరాజును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



రెవెన్యూ అసోసియేషన్ డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

అర్ధరాత్రి దాటాక విజయనగరం వాసుల కేరింత

నూతనోత్సాహం

● పిల్లల నుంచి పెద్దల వరకు శుభాకాంక్షల వెల్లువ
● అధికారులు, ప్రజాప్రతినిధుల వద్దకు క్యూ
● స్వీట్లు, పూల బొకేలు, మొక్కలకు డిమాండ్
● ఆలయాలకు పోటెత్తిన జనం



విజయనగరం/కలెక్టరేట్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరం తొలి రోజున జిల్లా ప్రజలు కొత్తగా గడిపేందుకు ప్రాధాన్యం ఇచ్చారు. స్నేహితులు, బంధువులు, శ్రేయోభిలాషులకు బహుమతులు, స్వీట్లు ఇవ్వడంతో పాటు ఆలయాలకు క్యూ కట్టారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల ఇళ్లు కోలాహలంగా మారిపోయాయి. స్వీట్లు, పూల బొకేలు, మొక్కలకు చాలా డిమాండ్ ఏర్పడింది. వాటిని ధర పెంచి విక్రయించడం కనిపించింది. పిల్లలు రోజంతా సందడి చేశారు. గ్రీటింగ్ కార్డులు అందజేస్తూ స్వీట్లు, చాక్‌లైట్లు, బిస్కెట్లు పంచుకున్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఇల్లు, క్యాంప్ కార్యాలయం నేతలు, నాయకులు, ప్రజలతో నిండిపోయాయి. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అశోక్ గజపతిరాజు, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకు శుభాకాంక్షలు తెలిపేందుకు అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు వచ్చారు. వారు పెన్నులు, పుస్తకాలు, మొక్కలు అందజేశారు. కలెక్టర్ అంబేడ్కర్‌కు శుభాకాంక్షలు తెలిపేందుకు అధికారులు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు అధిక సంఖ్యలో రావడం కనిపించింది. ఎస్పీ కార్యాలయం కూడా కళకళలాడింది. ఎస్పీ వకుల్ జిందాల్, ఏఎస్పీలు నాగేశ్వరరావు, సౌమ్యలతకు పోలీసు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని పైడిమాంబ దేవాలయం, ఎస్.కోట దుర్గాదేవి ఆలయం, బొబ్బిలి వేణుగోపాలస్వామి, రామతీర్థం లోని రాములోరి ఆలయాన్ని భక్తులు విశేషంగా సందర్శించారు.

నిబంధనలు పట్టని 184 మందిపై కేసులు..

విజయనగరం క్రైం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్స రానికి స్వాగతం చెప్పే క్రమంలో మంగళవారం రాత్రి నిబంధనలు అతిక్రమించిన వారిపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. జిల్లా అంతటా ఎక్కడికక్కడ పోలీసు పికెట్ ఏర్పాటు చేయడంతో పాటు వాహన తనిఖీలు చేపట్టారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై 42 కేసులు నమోదయ్యాయి. మద్యం సేవించి వాహనం నడిపే వారిపై 5 కేసులు నమోదు చేశారు. జిల్లా మొత్తంగా మోటారు వాహనం చట్టం అతిక్రమించిన వారిపై 184 కేసులు నమోదు చేశారు. గుర్ల పోలీసు స్టేషన్ పరిధిలోని దత్త ఎస్టేట్‌లో పేకాటడుతున్నట్టు అందిన సమాచారంతో పోలీసులు రైడ్ చేసి పేకాటాడుతున్న 32 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 22 సెల్‌ఫోన్లు, 4 కార్లు, పది మోటారు సైకిళ్లు , లక్షా 82 వేల 744 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు.



మయూరి కూడలిలో అర్ధరాత్రి తిరుగుతున్న యువతను ప్రశ్నిస్తున్న సీఐ శ్రీనివాసరావు

ఫుల్‌గా తాగేశారు

● రూ 14.3 కోట్ల మద్యం విక్రయాలు



విజయనగరం క్రైం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా డిసెంబరు 31న రూ.14.3 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. ఉమ్మడి విజయనగరం జిల్లాకు నెల్లిమర్లలోని ఐఎంఎల్ డిపో నుంచి మద్యం సరఫరా అయింది. 177 మద్యం షాపులు, 28 బార్లలో 25,700 కేసుల మద్యం బాటిళ్ల విక్రయాలు జరిగాయి. తద్వారా రూ.14.3 కోట్ల లావాదేవీలు జరిగినట్లయింది. గత ఏడాది 19 వేల మద్యం బాటిళ్ల ద్వారా రూ.13.5 కోట్ల అమ్మకాలు జరిగాయి. ఈ ఏడాది భారీగానే మద్యం విక్రయాలు జరిగాయని డిపో మేనేజర్ గౌరీశ్వరరావు తెలిపారు.

నదిని తోడేస్తున్నారు

● నాగావళి నదిలో భారీ యంత్రాలతో తవ్వకాలు ● ఇప్పటికే దిశ మారిన ప్రవాహం
● మొక్కుబడి చర్యలతో సరిపెడుతున్న అధికారులు

ఒకవైపు ఉమ్మడి విజయనగరం జిల్లా, మరోవైపు పార్వతీపురం మన్యం జిల్లా సరిహద్దుగా ఉన్న నాగావళి నదిని అక్రమార్కులు మింగేస్తున్నారు. భారీ యంత్రాలతో ఇష్టారాజ్యంగా తవ్వుకుపోతున్నారు. రాత్రీపగలు నదిని గుల్ల చేస్తున్నారు. వారి ధనదాహానికి నదీ ప్రవాహ దిశ ఇప్పటికే మారిపోయింది. నిబంధనలు కాని, అధికారుల ఆదేశాలు కాని, సహజ వనరును కాపాడుకోవాలన్న ఆలోచన కాని లేకుండా నదిని దోపిడీ చేస్తున్నారు.

రేగిడి, జనవరి 1,(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా రేగిడి మండలం బొడ్డవలస, పార్వ తీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం గోపాలపురం వద్ద నాగావళి నది మధ్యలో ఇసుక దొంగలు తిష్టవేశారు. అనధికార క్వారీలు నిర్వహిస్తూ ఎక్సకవేటర్లతో ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ఇప్పటికే నదీలో పెద్దగుంతలు ఏర్పడి నదీప్రవాహ దిశకు ముప్పుతెచ్చారు. అయినా అధికారుల నిఘా ఉండడం లేదు. రెండు జిల్లాల అధికారులు మీనమేషాలు లెక్కించడంపై ఈప్రాంతీయుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. విజయనగం జిల్లా యంత్రాంగానికి స్థానిక అధికారులు నివేదిస్తున్నా ప్రయోజనం ఉండడం లేదు. మరో సరిహద్దుగా ఉన్న పార్వతీపురంమన్యం జిల్లా యంత్రాంగంలో కూడా దీనిపై ఇసుమంత చలనం లేకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.


ఇసుక వ్యవహారం వెనుక పెద్దనేతలు ఉండటంతోనే గత వైసీపీ ప్రభుత్వం నుంచి నేటి ప్రభుత్వం వరకు తవ్వకాలు నివారించలేకపోతున్నారన్నది స్థానికంగా వినిపిస్తున్న విమర్శ.

● నదిలో భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేపట్టడం ఒకనేరం కాగా మరోవైపు ఈప్రాంతంలో ఏడు మండలాలకు రక్షిత నీరు అందించే రక్షితసోర్స్(ఇన్‌ఫిల్టరేషన్ వెల్స్) ఉన్నాయి. వాటి చెంతే తవ్వకాలు చేస్తున్నారు. నిరాటంకంగా అక్రమ క్వారీలు సాగిస్తున్నారు. వెల్స్‌కు 500 మీటర్లలోపు క్వారీలు నిషేధమైనా ఇవి అక్రమార్కులకు పట్టడంలేదు. నదీలో ఉన్న పెద్దపెద్దగుంతల వల్ల బొడ్డవలస వద్ద గతంలో నదిలో పలువురు దిగబడిపోయి చనిపోయిన ఘటనలు ఉన్నాయి. ఏదైనా ప్రమాదం జరిగితే ఆ రోజు అధికారులు హడావిడి చేయడం తర్వాత వదిలేయడం షరామామూలైపోయింది.

అధికారులకు నివేదించాం

నాగావళి నది మధ్యలో ఇసుక తవ్వకాలపై జిల్లా స్థాయి అధికారులకు నివేదించాం. బొడ్డవలస పరిధిలో ఇసుక తవ్వకాలు ఇప్పటికే నియంత్రించాం. నది మధ్యలోనూ, ఎక్సకవేటర్లతో రక్షితవెల్స్ దగ్గరలోనూ ఇసుక తవ్వకాలు జరుగుతున్నమాట వాస్తవమే. అది ఉమ్మడి జిల్లా సరిహద్దుగా ఉంది. తవ్వకాలు జరుగుతున్న ప్రాంతం తమ పరిధికాదని నివేదించాం.

- చిన్నారావు, తహసీల్దార్



గంతలతో గోపాలపురం-బొడ్డవలస మధ్య నాగావళి నది

అనుమతి లేకుండానే!

● వాటర్‌ప్లాంట్ నిర్మాణం
● నోటీసులు ఇస్తామన్న ఈవోపీఆర్‌డీ
● గత ప్రభుత్వంలో ఏర్పాటు
● ఆరా తీస్తున్న అధికారులు

జామి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): గ్రామంలో సాధారణంగా ఓ ఇల్లు నిర్మించుకోవాలంటేనే పంచాయతీ అనుమతి తీసుకుంటాం. పంచాయతీ తీర్మానం చేశాక కరెంట్ మీటరు, ఇంటిపన్ను వేస్తారు. పెద్దపెద్దభవనాలైతే ముందు పంచాయతీ అనుమతి తీసుకుని చుట్టు కొలతలు, విస్తీర్ణం వంటి వివరాలు అందించి ఉడా అనుమతులతో కట్టడం ప్రారంభిస్తుంటారు. అయితే ఇవేమి లేకుండా జామి మండలంలోని జాగరం గ్రామంలో కోట్ల రూపాయలతో ఓ వాటర్‌ప్లాంట్‌ను వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేశారు. అప్పటి పంచాయతీ పాలకులు, అధికారులు అడ్డుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక దీనిపై లోతుగా ఆరా తీస్తున్నారు.

జాగరం పంచాయతీ పరిధిలో వాటర్‌బాటిల్ కంపెనీ 4.6 ఎకరాల విస్తీర్ణంలో 2022లో నిర్మాణం ప్రారంభించారు. అయితే వారు పంచాయతీకి చెప్పలేదు. ఇప్పుడు పంచాయతీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్లాంట్ ప్రారంభించి ఏడాది అవుతున్న నేపథ్యంలో ఏ ప్రతిపాదికన పన్ను వేయాలి..? ఎంత వేయాలి? అనే విషయంపై అయోమయంలో పడ్డారు. పంచాయతీ కార్యదర్శి అనురాధను వివరణ కోరగా గతంలో నిర్మాణ సమయంలో పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోలేదని, గ్రామసభ తీర్మానం లేదని తెలిపారు. ఈ విషయాన్ని ఈవోపీఆర్‌డీ దృష్టిలో పెట్టామన్నారు. ఈవోపీఆర్‌డీ ఉమాను వివరణ కోరగా తన దృష్టికి వచ్చిందని, కంపెనీకి పంచాయతీ నోటీసులు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. కంపెనీ మేనేజర్‌ను వివరణ కోరగా ఈ పరిశ్రమ నిర్మాణానికి పంచాయతీ అనుమతులు అవసరం లేదని, ఇది తనకు తెలిసిన విషయమేనన్నారు. పంచాయతీ వారు నోటీసులు ఇస్తే తాము మాట్లాడతామని తెలిపారు.



ప్లాంట్ లోపలి విభాగం



జాగరం వద్ద నిర్మించిన వాటర్‌ప్లాంట్

ట్యాబులు.. మూలకు!

● గత సర్కారు రెండు విడతల్లో 38,521 పంపిణీ ● బైజూస్ వారితో ఆన్‌లైన్ బోధన
● నేడు ఎక్కడా కనిపించని వైనం ● కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా



ప్రభుత్వ విద్యను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దామంటూ బైజూస్‌తో ఆన్‌లైన్ బోధనకు ఒప్పందం కుదుర్చుకుని తొమ్మిదో తరగతి విద్యార్థులకు గత ప్రభుత్వం ట్యాబులు పంపిణీ చేసింది. వాటిపై కోట్లాది రూపాయల వ్యయం చేసింది. ఏడు అవి ఏమయ్యాయో తెలియదు. ఎన్ని పనిచేస్తున్నాయో... చెప్పేవారు లేరు. బైజూస్ బోధన అంతకంటే లేదు. అనాలోచితంగా చేసిన ఖర్చు వృథా అయిపోయింది.

రాజాం, జనవరి1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2022-23 విద్యాసంవత్సరంలో అప్పటి వైసీపీ ప్రభుత్వం 21,015 ట్యాబులను అందించింది. మొత్తం 457 పాఠశాలలకుగాను.. విద్యార్థులకు 18,101... ఉపాధ్యాయులకు 2,457 ట్యాబులను పంపిణీ చేసింది. 2023-24 విద్యాసంవత్సరంలో 17,506 ట్యాబులను అందించింది. ఆ ఏడాది ఉపాధ్యాయులకు ఇవ్వలేదు. అయితే ఈ రెండు విడతల్లో ట్యాబుల పంపిణీకి కోట్లాది రూపాయలు ఖర్చుచేసింది. నేడు అవి ఎక్కడా సక్రమంగా పనిచేయడం లేదని సమాచారం. ఉపాధ్యాయుల ట్యాబులు సైతం సాంకేతిక సమస్యలతో మొరాయించాయి. ఆ ట్యాబుల సాయంతోనే తొమ్మిదో తరగతికి వచ్చిన విద్యార్థుల కోసం డిజిటల్ తరగతులు నిర్వహించాల్సి ఉంది. ట్యాబులు పనిచేయకపోవడం, వాటిని బాగుచేసే సమర్థమైన వ్యవస్థ లేకపోవడం, ఉపాధ్యాయులకు పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడంతో బైజూస్ బోధన పడకేసింది.

● బైజూస్ కంటెంట్ బోధనకు సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. ట్యాబులు లాగిన్ కాకపో వడం, లాక్ పడిపోవడం, దానికదే ఆగిపోవడంతో విద్యార్థులు అవస్థలు పడేవారు. ఉపాధ్యాయులకు సైతం అవగాహన లేక నిస్సహాయత వ్యక్తం చేశారు. ట్యాబులు ఇచ్చిన ప్రభుత్వం వాటి నిర్వహణపై సరైన దృష్టిపెట్టలేదు. ప్రారంభంలో సాంకేతిక సమస్యలు ఎదురుకావడంతో డీఈవో కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటుచేశారు. వారి వద్దకు తీసుకెళ్లి బాగుచేసేవారు. మరోవైపు హిందీ, ఇంగ్లీష్, తెలుగు సబ్జెక్ట్ టీచర్లకు ట్యాబులు అందించినా వారికి సంబంధించి కంటెంట్ యాప్ ట్యాబుల్లో లేకుండా పోయింది.

● జిల్లాలో చాలా పాఠశాలలు మారుమూల ప్రాంతాల్లో ఉన్నాయి. అటువంటి చోట నెట్‌వర్క్ సమస్య ఇబ్బందిగా ఉండేది. ఉపాధ్యాయులు తమ సెల్ ఫోన్‌లో హాట్‌స్పాట్ ద్వారా నెట్ సదుపాయం పొందేవారు. కానీ పావుగంట వ్యవధిలో మెమొరీ అయిపోయేది. ట్యాబుల వినియోగంపై జిల్లాస్థాయిలో ప్రత్యేక కమిటీని అప్పట్లో జగన్ ప్రభుత్వం ఏర్పాటుచేసింది. మండలానికి ఇద్దరు ఉపాధ్యాయులకు ట్యాబుల వినియోగం, సాఫ్ట్‌వేర్, హార్డ్ వేర్ సమస్యలపై నోడల్ పర్సన్లతో శిక్షణ ఇప్పించింది. కానీ మండలానికి వందలాది ట్యాబులను పర్యవేక్షించడం కత్తిమీద సాములా మారింది. మధ్యలో ట్యాబుల పర్యవేక్షణ బాధ్యతలను గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు అప్పగించారు. అసలు ఎటువంటి శిక్షణ లేకుండా తమను బాగుచేయమనడంపై వారంతా అభ్యంతరాలు వ్యక్తం చేశారు. మరోవైపు ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నా గత ప్రభుత్వం బైజూస్ విద్యాబోధనకే మక్కువ చూపింది. అయినాగాని మూన్నాళ్ల ముచ్చటగా మిగిలింది. కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అయ్యింది.

ట్యాబులు పనిచేయడం లేదు

పి.ప్రవీణ్‌కుమార్, ఎంఈవో, రాజాం

ప్రభుత్వం సరఫరా చేసిన ట్యాబులు పనిచేయడంలేదు. వాటికి మరమ్మతులు చేయించాలని కూడా ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు. కొన్ని ట్యాబులు విద్యార్థుల దగ్గరే ఉన్నాయి. వాటిని ఇంకా స్వాధీనం చేసుకోలేదు.


విజయనగరం: ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న శిష్టకరణ సంఘం జిల్లా ప్రతినిధులు


బొబ్బిలి: కోటలో ఎమ్మెల్యే బేబీనాయనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీడీపీ శ్రేణులు, అధికారులు


లక్కవరపుకోట: ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న రెవెన్యూ సిబ్బంది


రాజాం: భారీ కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

పోటెత్తిన అభిమానం

- ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు, ఉన్నతాధికారులకు శుభాకాంక్షల వెల్లువ
- పండగ వాతావరణంలో 'కొత్త' వేడుకలు

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా బుధవారం ఉదయాన్నే ఎమ్మెల్యేలు, పార్టీ నేతలకు శుభాకాంక్షలు తెలియజేయడానికి నాయకులు, కార్యకర్తలు పోటెత్తారు. పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఉమ్మడి విజయనగరం జిల్లాలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్నతాధికారులకు అధికారులు, సిబ్బంది నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. దీంతో పండగ వాతావరణం నెలకొంది.

(ఆంధ్రజ్యోతి బృందం)


వీరఘట్టం: ఎం.రాజపురంలో ఎమ్మెల్యే జయకృష్ణకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న అభిమానులు


నెల్లిమర్ల: రవిశేఖర్, ఆనంద్‌కుమార్‌లకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు, కార్యకర్తలు


జియ్యమ్మవలస: చినమేరంగిలో కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి శత్రుచర్ల, విప్ తోయక జగదీశ్వరి


గరివిడి: టీడీపీ శాశ్వత పార్టీ సభ్యత్వ రుసుం చెక్కును ఎమ్మెల్యే కిమిడికి అందజేస్తున్న గద్దె అనురాగ్


భోగాపురం: ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణలకు శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు


భోగాపురం: ఎమ్మెల్యే నాగమాధవికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న దృశ్యం


పార్వతీపురం రూరల్: నర్సిపురంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు, కార్యకర్తలు, మహిళలు


సీతంపేట రూరల్: ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు

కలెక్టర్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు

శృంగవరపుకోట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ అంబేడ్కర్‌కు శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌కు టీడీపీ కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పలరాంప్రసాద్, ఎల్.కోట జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరెండ్ల ఈశ్వరరావు తదితరులతో కలిసి ఆమె వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్‌ను కోరారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి


అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన

శృంగవరపుకోట రూరల్, జనవరి 1 (ఆంధ్ర జ్యోతి): కేంద్రమంత్రి వర్గం నుంచి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని కోరుతూ మండలంలోని కొత్తూరులో బుధవారం అంబేద్కర్ విగ్రహం ఎదుట సీపీఎం, కేవీపీఎస్ నాయకులు ఆందోళన చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. కార్యక్రమంలో మద్దిల రమణ, గొల్ల సత్యనారాయణ ఉన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

వీరఘట్టం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెట్టంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు విద్యార్థులకు నివాసాలు, పాఠశాలల్లో ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించరు. కార్యక్రమంలో హెచ్ఎం దూసి నాగమణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి

రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు బాబు కృషి


కేక్ కట్ చేస్తున్న నాగార్జున

చీపురుపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మన రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఆయన చీపురుపల్లిలోని తన నివాసంలో బుధవారం కేక్ కట్ చేశారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు పరుగులు తీస్తున్నాయన్నారు. పోలవరం ప్రాజక్టు, రాజధాని నిర్మాణం చురుగ్గా సాగుతున్నాయన్నారు. మన జిల్లాలో భోగాపురం విమానాశ్రయం పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయన్నారు. చంద్రబాబుపై విశ్వాసంతో పలు కంపెనీలు పెట్టుబడులతో రాష్ట్రానికి తరలివస్తున్నాయన్నారు. గూగుల్, టీసీఎస్ వంటి ప్రముఖ ఐటీ కంపెనీలు విశాఖకు రావడం వల్ల ఈ ప్రాంతంలో నిరుద్యోగులకు మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. విశాఖను ఐటీపరంగా అభివృద్ధి చేసేందుకు మంత్రి లోకేశ్ దృష్టి సారించారని నాగార్జున అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన కార్యాలయంలో..

పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. నియోజకవర్గ ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పైడిమాంబకు ప్రత్యేక పూజలు

విజయనగరం రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడిమాంబ ఆలయంలో బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన సంవత్సరం సందర్భంగా అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పైడిమాంబను దర్శించుకున్నారు. అలాగే రైల్వేస్టేషన్ ఎదుట ఉన్న వనంగుడిలోనూ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు దర్శించుకుని పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు.

అలాగే విఘ్నేశ్వరుడికి అత్యంత ప్రీతిపాత్రమైన బుధవారం నూతన సంవత్సరం ప్రారంభం కావడంతో నగరంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న వినాయక ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సిటీ బస్టాండ్ వద్ద సిద్ధిబుద్ధి వినాయక ఆలయం, కొత్తపేటలోని సంపత్ వినాయక ఆలయం, దాసన్నపేట రోడ్డు, గుమ్చీ వద్ద వున్న వినాయక ఆలయాలల్లో స్వామిని పెద్దఎత్తున భక్తులు దర్శించుకున్నారు. శివాలయం వీధిలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, పూల్‌బాగ్ రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయాలకూ భక్తు తతాకిడవి అధికంగా ఉంది.



పుష్పాలంకరణలో పైడితల్లమ్మ, అమ్మవారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

నెల్లిమర్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని రామస్వామి దేవస్థానంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన సంవత్సరం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

కూలిన ధ్వజస్తంభం.. భక్తుల ఆందోళన

పూసపాటిరేగ, జనవరి1 (ఆంధ్రజ్యోతి): కోనాడలోని పురాతన వేణుగోపాలస్వామి ఆలయంలో ధ్వజ స్తంభం కూలిపోవటంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆలయం నదీ సంగమ ప్రదేశంలో ఉండటంతో పురాతన కాలం నుంచి ఎంతో ప్రాచుర్యం పొందింది. ఇప్పటికే జీర్ణావస్థలో ఉన్న 300 ఏళ్లనాటి ధ్వజస్తంభం శనివారం కూలిపోయి ఎదుట ఉన్న మండపంపై పడింది. దాంతో అర్చకులు శాస్త్రోక్తంగా ఉద్వాసన పలికి శకలాలను తొలగించారు. గతంలో హుద్‌హుద్ తుపానుకు ధ్వజస్తంభం కొంతమేర ఒరిగింది. తాత్కాలిక చర్యలకే దేవాదాయశాఖ అధికారులు పరిమితం కావడంతో నేడు ధ్వజస్తంభం కుప్పకూలింది.

వెంటనే పునర్నిర్మించాలి..

ఎంతో ప్రాధాన్యత కలిగిన వేణుగోపాలస్వామి దేవాలయంలో ఇలా ధ్వజస్తంభం కూలిపోవటం దురదృష్టకరం. భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని దృష్టిలో వెంటనే నిర్మాణం చేపట్టాలి.**– విజ్జపు కిరణ్, కోనాడ గ్రామస్తుడు**

చర్యలు చేపడతాం..

ధ్వజస్తంభం కూలిన ఘటన మాదృష్టికి వచ్చింది. ఇప్పటికే పైఅధికారులు తెలియజేశాం. కొంతమంది దాతలను సంప్రదిస్తున్నాం.

– జగదీశ్వరి, దేవాదాయశాఖ అధికారి


కూలిన ధ్వజస్తంభం ఇదే..

దివ్యాంగులకు శుభవార్త!

- మూడు చక్రాల వాహనాలకు పెట్రోల్ రాయితీ
- వాహన సామర్థ్యం బట్టి సబ్సిడీ
- దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం



రాజాం, జనవరి1 (ఆంధ్రజ్యోతి)

దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. వారు ఉపయోగించే మూడు చక్రాల వాహనాలకు పెట్రోల్/డీజిల్‌ను 50 శాతం రాయితీ ప్రకటించింది. వైసీపీ ప్రభుత్వంలో నామమాత్రంగా ఈ పథకాన్ని మార్చింది. ఇప్పుడు కూటమి అధికారంలోకి రావడంతో దివ్యాంగులకు ఊతమిచ్చేలా పథకాన్ని మార్పుచేయాలని భావించింది. ఈ ఆర్థిక సంవత్సరానికి గానూ ఒక్కో జిల్లాకు రూ.లక్ష చొప్పున 26 జిల్లాలకు రూ.26 లక్షలను మంజూరు చేసింది. నిధులను సైతం విడుదల చేసింది. దీనిపై జిల్లాలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కూడా ప్రారంభమైంది.

● ఇదీ పరిస్థితి..

జిల్లాలో 49,622 మంది దివ్యాంగులు ఉన్నారు. ఇందులో చాలా మంది స్వయం ఉపాధితో పాటు ప్రైవేటు సంస్థల్లో పనిచేసిన వారున్నారు. వీరిలో ఎక్కువ మంది మూడు చక్రాల మోటారైజ్డ్ వాహనాలను వాడుతున్నారు. వీరికి రాయితీపై పెట్రోల్/డీజిల్ అందించనున్నారు. వీరి వాహనాలకు వినియోగించే పెట్రోల్ ఖర్చులో 50 శాతం రాయితీపై రీయింబర్స్ చేయనున్నారు. ఈ నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఇందుకుగాను నిర్దిష్టమైన మార్గదర్శకాలు కూడా జారీచేశారు. లబ్ధిదారుడు ఇంటి నుంచి పనిచేసే స్థలానికి.. పనిచేసిన చోటు నుంచి ఇంటికి చేరే దూరాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. 2 హార్స్ పవర్ ఇంజన్ సామర్థ్యం ఉన్న వాహనాలకు నెలకు గరిష్టంగా 15 లీటర్లు, 2 హార్స్ పవర్ కంటే గరిష్టంగా ఇంజన్ సామర్థ్యం ఉన్న వాహనాలకు గరిష్టంగా 25 లీటర్ల పెట్రోల్‌ను రాయితీపై అందిస్తారు. కొనుగోలుకు సంబంధించి రశీదులు జతచేస్తే రాయితీ మొత్తాన్ని బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు.

● నీరుగార్చిన వైసీపీ..

వాస్తవానికి గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ పథకం పక్కాగా అమలు చేశారు. కానీ వైసీపీ వచ్చిన తరువాత ఈ పథకానికి గ్రహణం పట్టింది. అరకొర కేటాయింపులు చేశారు. నామమాత్రంగా అమలు చేశారు. 2023-24లో అప్పటి వైసీపీ ప్రభుత్వం పథకానికి గాను రాష్ట్రంలో అన్ని జిల్లాలకు కేటాయించింది కేవలం రూ.3 లక్షలు మాత్రమే. అందులో ఖర్చుచేసిన నిధులు అక్షరాల రూ.1.86 లక్షలు మాత్రమే. అంటే పథకాన్ని ఎంత చిత్తశుద్ధిగా అమలు చేశారో ఇట్టే అర్థమవుతోంది. అయితే కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున రాయితీ ప్రకటించడం, నిధులు విడుదల చేయడంతో దివ్యాంగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

● దరఖాస్తు ప్రక్రియ ఇలా..

ఈ పథకానికి దారిద్ర్యరేఖకు దిగువనున్న వారు మాత్రమే అర్హులు. స్వయం ఉపాధితో పాటు ప్రైవేటు సంస్థల్లో పనిచేసి ఉండాలి. ప్రభుత్వ ఉద్యోగాలు చేసేవారికి ఈ పథకం వర్తించదు. దరఖాస్తుతో పాటు సదరం ధ్రువపత్రం, పెట్రోల్ బిల్లులు, రేషన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, వాహనం రిజిస్ట్రేషన్ ధ్రువపత్రం, బ్యాంక్ పాస్ బుక్ మొదటి పేజీ, పాస్‌పోర్టు సైజ్ ఫొటో (వైకల్యం కనిపించేలా), వ్యాపారం లేదా ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్నట్టు ధ్రువపత్రాల జిరాక్సులు సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తులను విజయనగరంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ కార్యాలయానికి అందించాల్సి ఉంటుంది.

● దరఖాస్తుల ఆహ్వానం..

దివ్యాంగుల మూడు చక్రాల వాహనాలకు సంబంధించి ప్రభుత్వం పెట్రోల్/డీజిల్ రాయితీపై అందిస్తుంది. ఇందుకుగాను లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలి. కేవలం స్వయం ఉపాధి, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న వారు అర్హులు. మూడు చక్రాల మోటరైజ్డ్ వాహనాలను వినియోగిస్తుండాలి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వివరాలకు కార్యాలయానికి సంప్రదించవచ్చు.

-జీవీబీ జగదీష్, పర్యవేక్షకుడు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ, విజయనగరం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గజపతినగరం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ కె.లక్ష్మణరావు అందించిన వివరాలు ప్రకారం.. మండలంలోని గంగచోళ్లపెంట గ్రామానికి చెందిన కనకళ లక్ష్మునాయుడు(44) పెయింటింగ్ పనులు జీవనం సాగిస్తున్నాడు. గజపతినగరంలో పనిచేస్తూ మధ్యాహ్న భోజనానికి స్వగ్రామం గంగచోళ్లపెంటకు సైకిల్‌పై వెళ్తుండగా నాలుగు రోడ్ల జంక్షన్‌లో బొబ్బిలి నుంచి విజయనగరం వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దాంతో అక్కడికక్కడే లక్ష్మణరావు మృతి చెందాడు. అతడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య లీల, కుమారుడు చాణక్య ఉన్నారు. లీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

కష్టసుఖాల్లో అండగా ఉంటాం..



సంతాపసభలో మాట్లాడుతున్న సాయిప్రశాంత్ కుమార్

రాజాం రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మిత్రుడి మరణం వారి కుటుంబ సభ్యులతో పాటు మాకూ తీరని లోటని, మిత్రుడి కుటుంబ కష్టసుఖాల్లో అండగా నిలుస్తామని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాజాం శాఖ, ఓల్డ్‌ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్ కుమార్ స్పష్టం చేశారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఉపాధ్యాయుడు, యూటీఎఫ్ నాయకుడు దేశెట్టి వెంకటరావు సంతాపసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనతో ఉన్న సంబంధాన్ని స్నేహితులు గుర్తు చేసుకున్నారు. ఉపా ధ్యాయుడిగా విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో వెంకటరావు కృషిని కొనియాడారు. యూటీఎఫ్ అభివృద్ధికి ఎంతో పాటుపడ్డారని ప్రశంసించారు. కార్యక్రమంలో ఓల్డ్‌ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు గట్టి పాపారావు, యు.వి.యు.చంద్రశేఖర్, సంచాన చంద్రినాయుడు, ఇద్దుం శ్రీనివాసరావు, డాక్టర్ రఘు, దామెర సీతారమేష్, యామన భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

శతశాతం ఫలితాలు సాధించండి

కొత్తవలస, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : పదవతరగతి పరీక్షలలో విద్యార్థులుశతశాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఉపాధ్యాయులకు సూచించారు. యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం తయారు చేసిన 10 టెన్త్ మోడల్ పేపర్ల పుస్తకాన్ని ఆమె కొత్తవలసలో బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని టెన్త్ విద్యార్థులందరూ ఈ ఏడాది శతశాతం ఉత్తీర్ణత సాధించేలా తర్ఫీదు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కొత్తవలస, లక్కవరపుకోట మండలాలకు చెందిన ఎంఈవోలు బండారు శ్రీనివాసరావు, చలుమూరు కూర్మారావు మాట్లాడుతూ యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘంలోని నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా మోడల్ పేపర్లను తయారు చేయించామన్నారు. ఇవి విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండలశాఖ ప్రతినిధులు నిర్మలాదేవి, విజయగౌరి, జి.పార్వతి, జి.వెంటనాయుడు పాల్గొన్నారు.

భాస్కర్‌ను అభినందించిన చంద్రబాబు

గంట్యాడ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): గజపతినగరం నియోజకవర్గం పరిధిలోని గంట్యాడ మండలం తెలుగుదేశం సభ్యత్వం నమోదులో ప్రథమ స్థానంలో నిలపడంపై మండల పార్టీ అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్ నాయుడును సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. అమరావతి నుంచి మంగళవారం రాత్రి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలంలోని 20 వేల సభ్యత్వాలు నమోదు చేయడంపై ప్రశంసించారు. రానున్న రోజుల్లో మరింత కష్టపడి పని చేయాలని సీఎం సూచించారు.

నేడు తాగునీటి సరఫరా బంద్

రాజాం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని డోలపేట ఎలివేటెడ్ లెవెల్ సర్వీస్ రిజర్వాయిర్ నుంచి వచ్చే పైపులైన్లు మరమ్మతు గురైన నేపథ్యంలో గురువారం తాగునీటి సరఫరా బంద్ చేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కేర్ కూడలి, మారుతీనగర్ రెండో లైన్. నాలుగో లైన్‌లో పైపులైన్లు రోడ్డు విస్తరణ పనుల కారణంగా మరమ్మతు గురయ్యాయన్నారు. అక్కడ మరమ్మతు పనులు చేపట్టనున్న నేపథ్యంలో డోలపేట. బుచ్చింపేట, పొనుగుటివలస, మారుతీనగర్, విద్యానగర్, వరలక్ష్మీనగర్ తదితర ప్రాంతాలకు నీటి సరఫరా నిలిపివేస్తున్నట్టు వెల్లడించారు. సదరు ప్రాంతాలకు వాటర్ ట్యాంకుల ద్వారా తాగునీటి సరఫరా చేస్తామన్నారు. ఇందుకు ప్రజలందరూ సహకరించాలని కమిషనర్ కోరారు.

కళాకారుల సంక్షేమమే ధ్యేయం

● ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గోపాలకృష్ణ



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న గోపాలకృష్ణ

పార్వతీపురంటౌన్, జనవరి 1(ఆంధ్రజ్యోతి):: పౌరాణిక కళాకారుల సంక్షేమమే ధ్యేయమని ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ తెలిపారు. పార్వతీపురంలో ఉత్తరాంధ్ర పౌరాణిక పద్యనాటక కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పౌరాణిక పద్య ఏకపాత్రాభియ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంహయాంలో పౌరాణిక కళాకారులను ఆదుకున్న దాఖలాలు లేవన్నారు. సీఎం చంద్రబాబు కళాభిమాని కావడం, డిప్యూటీ సీఎం కళాకారుడు కావడంతో త్వరలో పౌరాణిక కళాకారులకు మంచిరోజులు వస్తాయన్నారు. వృద్ధ కళాకారులకు రూ.ఆరువేలు పింఛన్ అందించాలని, ప్రభుత్వానికి కోరుతానని తెలిపారు.తిరుమలతోపాటు సింహాచలం, శ్రీశైలం, అన్నవరం, విజయవాడ పుణ్యక్షేత్రాల్లో వెయ్యికి తక్కువ కాకుండా పౌరాణిక నాటకాలు ప్రదర్శించాలన్న సంకల్పం పెట్టుకున్నామని చెప్పారు. అకాడమీని కళాకారుల ఉపాధి కల్పనా కేంద్రంగా మార్చేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. పౌరాణిక నాటకాలకు పూర్వవైభవం తీసుకువస్తామని తెలిపారు. అనంతరం రంగస్థల నటుడు కె.గున్నేశ్వరరావును వెండి కిరీటంతో సత్కరించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర పౌరాణిక పద్య నాటక కళాకారుల సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపకులు పల్లి నల్లనయ్య, ఆ సేవా సంఘం అధ్యక్షులు బడే శ్రీరాములు నాయుడు, కార్యదర్శి వి.మారుతీప్రసాద్, కోశాధికారి ఎం.దామోదరరావు, ఉపాధ్యక్షులు, పోటీల ఆర్గనైజర్ ఎన్. సింహాచలం పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలతోనే విజయాలు

● బొబ్బిలి నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి కండాపు ప్రసాదరావు

బొబ్బిలి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి):సీపీఐ భవిష్యత్‌లో మరిన్ని ప్రజా పోరాటాల ద్వారా విజయాలు సాధిస్తుందని ఆ పార్టీ బొబ్బిలి నియోజకవర్గ కార్యదర్శి కండాపు ప్రసాదరావు తెలిపారు. బుధవారం బొబ్బిలిలోని సీపీఐకార్యాలయంలో పార్టీ వందేళ్ల ఘనచరిత్రపై గోడపత్రికను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తాము బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, వారి హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తున్నామని తెలిపారు. బ్రిటీషు పాలకుల నిర్బంధాలు, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా 1925 డిసెంబరు 26న ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో పార్టీ ఆవిర్భవించిందని, అప్పటి నుంచి ఎన్నోచారిత్రక విజయాలను సాధించిందని చెప్పారు. వేలాది మంది కమ్యూనిస్టులపై మీరట్‌కుట్ర కేసును బనాయించి దశాబ్దకాలం పాటు జైలులో పెట్టారని గుర్తుచేశారు. తమ పార్టీ స్వాతంత్ర్యానంతరం పార్లమెంట్‌లో ప్రజాపక్షాన గళం విప్పిందని తెలిపారు.అటవీహక్కులు, సమాచార హక్కు, గ్రామీణ ఉపాధిహామీ , బ్యాంకుల జాతీయకరణ వంటి చట్టాలకోసం చేసిన పోరాటాలను వివరించారు. ఇదే స్ఫూర్తితో ఇక ముందు కొత్తతరంవారితో సమన్వయం చేసుకుంటూ ముందుకువెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కోట అప్పన్న, మునకాల శ్రీనివాస్, బాబ్జీ, సింహాచలం, సత్యనారాయణ పాల్గొన్నారు.

నిర్వాసితులకు అగచాట్లు.. స్థానికేతరులకు కాసుల వర్షం

● నిబంధనలకు విరుద్ధంగా చేపలవేట

● ఇదీ మద్దువలస రిజర్వాయర్ బ్యాక్ వాటర్‌లో పరిస్థితి



చేపలను ఎగుమతికి సిద్ధం చేస్తున్న దృశ్యం



మద్దువలసలో వలకు చిక్కిన చేపలు

వంగర, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మద్దువలస రిజర్వాయర్ బ్యాక్‌వాటర్‌లో స్థానికేతర మత్స్యకారులు అక్రమంగా నిర్వహిస్తున్న చేపలవేట కాసుల వర్షం కురిపిస్తోంది. దీంతో రిజర్వాయర్ పరిధిలో నిర్వాసితులు అగచాట్లకు గురవుతున్నారు. కొద్ది రోజులుగా ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా స్థానికేతరులు వేట సాగించి పాగావేశారు. యథేచ్ఛగా వేట సాగిస్తున్నా అధికారులు చోద్యంచూస్తున్నారని నిర్వాసితులు వాపోతున్నారు. ప్రధానంగా ఇక్కడ సభ్యత్వం ఉన్నవారే మత్స్యసంపద వేటాడాలని వారు చెబుతున్నారు.

ఇదీ పరిస్థితి..

మద్దువలస రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా సర్వం కోల్పోయిన 575 మంది సభ్యులతో సీతారామ సొసైటీని ఏర్పాటు చేశారు. వీరంతా ప్రభుత్వానికి నామమాత్రంగా కొంతలీజు చెల్లించి చేపలవేట చేసుకోవాలని విధివిధానాలు రూపొందించారు. అయితే కొందరు అక్రమంగా దూరప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ పాగా వేసి చేపలవేట విచ్చలవిడిగా చేస్తున్నారు. నిబంధనల ప్రకారం మద్దువలస పరిసర ప్రాంతాలకు చెందిన నిర్వాసితులతోపాటు రిజర్వాయర్ పరిసర ప్రాంతాల్లో గిరిజనులు మాత్రమే చేపలవేట చేసేందుకు అర్హులుగా ప్రభుత్వం నిర్ణయించింది. అయితే కొవ్వూరు, నక్కపల్లి, కొల్లేరు ప్రాంతాలకు చెందిన మత్స్యకారులు వంగర మెట్ట, సీతారాంపురం, మద్దువలసలో గుడారాలు ఏర్పాటు చేసి చీకటిపడిన తర్వాత సోలార్ లైట్లు ఏర్పాటు చేసుకుని చేపలవేట చేస్తున్నారు. దీంతో స్థానికేతర మత్స్యకారులు రిజర్వాయర్‌లో చేపలవేట సాగించడాన్ని ముంపు గ్రామాల నిర్వాసితులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. స్థానికంగా కొంతమంది అండతోనే వీరు చేపలవేట సాగిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

పెద్ద వలలు.. చిన్న చేపలు

రిజర్వాయర్‌లో వరద నీరు తగ్గుతున్న నేపథ్యంలో పటువర్ధనం, కొట్టిశ, కొప్పర, కొండచాకరాపల్లి, నూకలివాడ పరిసర ప్రాంతాల్లో జోరుగా చేపలు పడుతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే మత్స్యకారుల వద్ద పెద్ద పెద్ద వలలు ఉండడంతో చిన్న చిన్న చేపలు కూడా వారికే దక్కుతున్నాని, తామంతా చేపలు పడక ఆర్థికంగా నష్టపోతున్నామని స్థానికంగా ఉండే పలువురు మత్స్యకారులు వాపోతున్నారు.

పాలకవర్గం ముగిసిన ఎన్నికలకు నోచుకోని వైనం..

మద్దువలస రిజర్వాయర్‌లో చేపలవేట సాగించిన మత్స్యకారులు సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన సీతారామా మత్స్యకార సొసైటీలో 574 సభ్యులు ఉన్నారు. వీరి సంక్షేమం కోసం సొసైటీ కార్యవర్గం ఏర్పాటుచేశారు. ఈ మేరకు అధ్యక్షుడితోపాటు ఆరుగురు డైరెక్టర్లను సొసైటీ సభ్యులు ఎన్నుకుంటారు. అయితే గత పాలకవర్గం పదవీకాలం ఆగస్టు 30తో ముగిసినా అధికారులు ఎన్నికలు నిర్వహించకుండా తాత్సారం చేస్తున్నారని సభ్యులు చెబుతున్నారు.

స్థానికేతరుల వేటకు అనుమతి లేదు..

మద్దువలస రిజర్వాయర్‌లో చిన్న చేపలవేట పూర్తిగా నిషేధించినట్లు మత్స్యశాఖ ఇన్‌చార్జి అభివృద్ధి అధికారి ప్రసాద్ చెప్పారు. ఇటీవల కొన్నివలలు సీజ్ చేశామని తెలిపారు. స్థానికేతరులకు ఇక్కడ చేపల వేట చేయడానికి అనుమతులు లేవని, తనిఖీలు చేపడతామని చెప్పారు. ఇప్పటికే మద్దువలసలో లీజు చెల్లించకపోవడంతో చేపలవేటపై నిషేధించామని తెలిపారు. మద్దువలస రిజర్వాయర్ సమీపంలో తనిఖీ నిర్వహించి అక్రమంగా వేటసాగించిన వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వైభవంగా గోదాదేవికి పూజలు



గోదాదేవి, రంగనాథ స్వామికి పల్లకీ సేవ చేస్తున్న భక్తులు

సాలూరు రూరల్, జనవరి 1 ఆంధ్రజ్యోతి): సాలూరులోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస 17వ రోజు పురస్కరించుకుని బుధవారం తిరుప్పావై పూజను వైభవంగా నిర్వహించారు. గోదారంగనాథస్వామికి ప్రత్యేక పూజలు, అర్చన,సేవాకాలం, పల్లకిసేవనురుత్వికులు నారాయణాచార్యులు, ఉదయ భాస్కరాచార్యులు శాస్త్రోక్తంగా చేశారు. పెదకోమటిపేటలో రంగనాథుడు,గోదాదేవిలకు ప్రత్యేక పూజలను నిర్వహించారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు



విశేష అలంకరణలో కామాక్షి అమ్మవారు

సాలూరు రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సాలూరులోని సంతోషి మాత, కామాక్షి,కల్యాణ వేంకటేశ్వరస్వామి తదితర ఆలయాలకు నూతన సంవత్సరం పురస్కరించుకుని బుధవారం తెల్లవారు జాము నుంచే భక్తులు పోటెత్తారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కామాక్షి ఆలయంలో వినాయకుడు, ఏకామ్రనాథుడులకు పుష్పాలంకరణ చేశారు. అమ్మవారికి స్వర్ణవర్ణ కిరీటం, హస్తాలు తదితర వాటితో విశేష అలంకరణ చేశారు.

దేవ్‌మాలిలో పర్యాటకుల సందడి

సాలూరు రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఒడిశాలోని కొఠియా కొండల్లో గల దేవ్‌మాలి పర్వతం వద్దకు బుధవారం పర్యాటకులు పోటెత్తారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని ఉల్లాసంగా గడపడానికి ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. దేవ్‌మాలిని ఒడిశా పర్యాటకంగా అభివృద్ధి చేసిన విషయం విదితమే. ప్రస్తుతం దేవ్‌మాలి పర్యాటకప్రాంత బాధ్యతలను కొఠియా పంచాయతీ పరిధిలోగల గెమ్మెల పొదర్ మహిళా సంఘానికి అప్పగించారు. ఒడిశా పర్యాటక శాఖ దేవ్‌మాలిలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో కొద్దిరోజులుగా పర్యాటకులు పోటెత్తుతున్నారు. ఇక్కడ ఏర్పాటుచేసిన పారాచూట్ పర్యాటకులను ఆకట్టుకుంటోంది.

అవగాహనతోనే ప్రమాదాల నివారణ

● రాయగడ జిల్లా కలెక్టర్ పారుల్‌పట్వార్



జెండా ఊపి రథాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ పారుల్ పట్వార్

ఒడిశా

రాయగడ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చని రాయగడ జిల్లా కలెక్టర్ పారుల్‌పట్వార్ తెలిపారు. అవగాహన రాహిత్యంలో పెరిగిపోతున్న రోడ్డు ప్రమాదలను నివారించేందుకు వాహన చోదకుల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా యంత్రాంగం భద్రతా వారోత్సవాల కార్యక్రమం చేపట్టింది. ఈమేరకు భాగంగా బుధవారం రాయగడలో చైతన్యరథాన్ని కలెక్టర్ పారుల్‌పట్వార్, అదనపు కలెక్టర్ భాస్కర్ చంద్ర రౌయిత్‌లు జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చోదకులు వాహనాలు నడిపే సమయంలో కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకోవాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ద్విచక్రవాహనాచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రాంతీయ రవాణాశాఖా ధికారి శివశంకర్ చౌదరి, అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ బాబిలతాషారాఫ్, జిల్లా ప్రజాసంబం ధాల అధికారి బసంత్‌కుమార్ ప్రధాన్, జిల్లాక్రీడాధికారి షేక్‌అలీనూర్, బస్సుయజమానుల సంఘం, లారీ యజమానుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కల్లాల్లో నూర్పులు.. రోడ్లపై ధాన్యం ఆరబోత

● సాలూరు మన్యంలో రైతులకు తప్పని ఇక్కట్లు



జాతీయ రహదారి 26పై పణుకువలస వద్ద ధాన్యం ఎండబెట్టిన దృశ్యం

సాలూరు రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సాలూరు మన్యంలో ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని రైతులు ఎండబెట్టడానికి అగచాట్లు పడుతున్నారు. సంక్రాంతి సమీపిస్తుండంతో పలు గ్రామాల్లో కళ్లాలకు చేర్చిన పంటను ముమ్మరంగా నూర్పిడి చేస్తున్నారు. ధాన్యం విక్రయించి పండగను సందడిగాచేసుకోవాలని నూర్పిడి వేగవంతం చేశారు. కాగా గతఏడాది శివారులో పంటచేతికి వచ్చిన సమయంలో ఎడ తెరిపిలేని వర్షాలు కురిసిన విషయం విదితమే. దీంతో కొన్నిచోట్ల కోసిన పంట తడిసిపోయింది. మరికొన్ని చోట్ల ఆదరాబాదరాగా కుప్పలుగా పెట్టినా అందులోకి నీరు చొరబడింది. దీనికితోడు వర్షాల నుంచి చేతికొచ్చిన పంటను ఎలాగైనా రక్షించుకోవాలన్న ఆతృతతో కొందరు పచ్చికంకులనే యంత్రాలతో నూర్పిన విషయం తెలిసిందే. అయితే రోజులు తరబడి వర్షాలు కురవడంతో కొన్నిచోట్ల ముక్కిపోగా, మరికొన్నిచోట్ల తడిసిపోయాయి. ప్రస్తుతం వర్షాలకు తెరిపిచ్చి ఎండలు పెడుతుండడంతో తడిసిపోయిన వరి ధాన్యం రహదారులు, కల్లాల్లో రైతులు ఆరబెడుతున్నారు. వర్షాలకు తడిసిపోయిన కుప్పలను కూడా త్వరగా నూర్పిడి చేయకపోతే పాడయ్యే ప్రమాదముండడంతో పనులు ముమ్మరం చేశారు.

రంగుమారిన ధాన్యం

గత ఏడాది డిసెంబరు శివారులో కురిసిన వర్షాలకు పంటను ఎలాగైనా రక్షించుకోవాలని ఆదరాబాదరాగా నూర్పిడిచేశారు. ఆ ధాన్యం వర్షాలకు తేమ చేరి రంగుమారాయి. ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలు, ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం విక్రయించాలంటే తొలుత వారు తేమశాతాన్ని గణిస్తారు. కొనుగోలుకేంద్రాల్లో ప్రభుత్వం నిర్ధేశించిన మేరకు ధాన్యం ఉండాలని అధికారులు స్పష్టంచేశారు. అయితే ప్రస్తుతం రైతులు ధాన్యంతేమశాతం తగ్గించడానికి అగచాట్లుపడుతున్నారు. దీంతో సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల్లోని పలు గ్రామాల్లో రహదారులు, కల్లాలు, ఖాళీ ప్రదేశాల్లో ధాన్యం ఎండబెట్టే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి రంగు మారిన ధాన్యం కొనుగోలు చేయడానికి వరకు నిబంధనలు సరళతరం చేయాలని కొందరు రైతులు కోరుతున్నారు.

నాణ్యత లేక.. నిర్వహణకు నోచుకోక

● ఇదీ ఎదుగుల కల్లాల రహదారి దుస్థితి



బురదమయమైన ఎగుదల కల్లాల రోడ్డు

జామి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నె గ్రామంలో రైతుల ఎదుగుల కల్లాల నుంచి శ్మశానానికి రాకపోకల కోసం నిర్మించిన రోడ్డు అధ్వానంగా మారింది. 2022లో రూ. ఆరు లక్షల వ్యయంతో వేసిన మెటల్‌రోడ్డు పూర్తిగా పాడైంది. కనీస నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతోపాటు నిర్వహణకు నోచుకోకపోవడంతో పెద్దపెద్ద గోతులు ఏరడ్డాయని గ్రామస్థులు వాపోతున్నారు.చిన్నపాటి వర్షం కురిసే బురదమయంకావడంతో రాకపోకలకు ఇబ్బందిపడాల్సివస్తోంది. రోడ్డు నిర్మాణ సమయంలో నాణ్యత ప్రమాణాలు అధికారులు పర్యవేక్షించకపోవడం వల్లే త్వరగా పాడయ్యిందని ఆ గ్రామ యువకులు ఆరోపిస్తున్నారు. తక్షణమే ఈ రోడ్డుకు మరమ్మతులు నిర్వహించి, తమ అవస్థలు తీర్చాలని పలువురు రైతులు కోరుతున్నారు. కాగా రోడ్డును పరిశీలించి చర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్ జేఈ నాయుడు తెలిపారు.

ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

సాలూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీల్లో పనిచేస్తున్నఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆ యూనియన్ నాయకుడు ఎన్‌వైనాయుడు డిమాండ్‌చేశారు. బుధవారం సాలూరు మునిసిపల్ కార్యాలయం ఆవరణలో తమ సమస్యలు పరిష్కరించాలని నిర్వహించే సమ్మెకు సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కారానికిశుక్రవారం నిర్వహిస్తున్న రాష్ట్ర వ్యాప్త నిరసనలకు కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేశారు.

చికిత్సపొందుతూ చెముడుగూడ వాసి మృతి



రమేష్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, జనవరి1(ఆంధ్రజ్యోతి):చెముడుగూడ గ్రామానికి చెందిన నిమ్మల రమేష్ చికిత్సపొందుతూ మృతిచెందాడు.కుటుంబసభ్యులు, స్థానికుల కథనం మేరకు... గతఏడాది డిసెంబరు 29 గుమ్మలక్ష్మీపురంలో జరిగిన ఉత్సవాల్లో కందికొట్ల పండుగలో అపశ్రుతి చోటు చేసుకున్న విషయం విదితమే. మరుగుతున్న సాంబారులో ప్రమాదవశాత్తు చెముడుగూడ గ్రామానికి చెందిన నిమ్మల రమేష్ జారి పడడంతో శరీరం 90 శాతం కాలిపోయింది. దీంతో భద్రగిరి ఆస్పత్రిలో చికిత్స అనంతరం పార్వతీపురం తరలించారు. అక్కడినుంచి విశాఖ కేజీహెచ్ రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఈమేరకు విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి చెముడుగూడలో రమేష్ కుటుంబ సభ్యులను బుధవారం సాయంత్రం పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ పాడి సుదర్శనరావు, ఎంపీటీసీ సభ్యుడు మండంగి రమణ పాల్గొన్నారు.

నేటి నుంచి పీసా ఎన్నికలు

గుమ్మలక్ష్మీపురం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 26 పంచాయతీల్లోని 72 గ్రామాల్లో గురువారం నుంచి ఈనెల నాలుగో తేదీ వరకు పీసా ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సాల్మన్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామసభలు ఏర్పాటుచేసి ఎన్నికల్లో ఉపాధ్యక్షుడు, కార్యదర్శులను ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు.

వంట సామగ్రి వితరణ

పాలకొండ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాల, బాలికల కళాశాలలకు మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ పల్లా కొండలరావు తల్లిదండ్రులు పల్లా బాబ్జీ, సూరమ్మల జ్ఞాపకార్థం లక్ష రూపాయలు విలువ చేసే వంట సామగ్రి, విద్యార్థులకు స్టీల్ కంచాలు బుధవారం అందించారు. శుక్రవారం నుంచి జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభిస్తున్న నేపథ్యంలో వీటిని అందించారు. కొండలరావుకు జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి మంజులవీణ, బాలబాలికల కళాశాలల ప్రిన్సిపాళ్లు హరగోపాల్, రేణుక, కళాశాల సిబ్బంది అభినందించారు.

అధికారులు రాకపోవడంపై మంత్రి అసంతృప్తి?

సాలూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సాలూరులోని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి నివాసం వద్ద మంగళవారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా జిల్లా ఉన్నతాధికారులు శుభాకాంక్షలు తెలియజేయడానికి రాకపోవడంతో అసంతృప్తి వ్యక్తంచేశారు. ప్రధానంగా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, రెవెన్యూ అధికారులు, పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏ పీవోలు ముఖం చాటేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి శుభాకాంక్షలు తెలియజేసినా, ఇక్కడి అధికారులు రాకపోవడంపై విమర్శలొస్తున్నాయి.

దివ్యాంగులకు దాతలు సహకరించాలి

సాలూరు రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు సాయం చేయడానికి దాతలు ముందుకురావాలని మదర్ థెరిస్సా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు జిల్లేళ్ల సీతారాం పిలుపునిచ్చారు. బుధవారం సాలూరు పట్టణ దివ్యాంగుల మహాసభ ఆర్యవైశ్య ధర్మశాలతో జరిగింది. ఈ సందర్భంగా దివ్యాంగుల స్థితిగతులను వివరించారు. కార్య క్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు మండవిల్లి సాంబశివ, ఇండుపూరి నారాయణరావు, పొట్టా పెదబాబు, నాగసాయి, బలబద్రుని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయిని మృతి

పాలకొండ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంకంపేట పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న గంగుల లక్ష్మి బుధవారం మృతిచెందారు. పాలకొండ సత్యసాయి మందిరం ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం విద్యార్థులకు బాల వికాస్ తరగతులు ఆమె నిర్వహిస్తున్నారు. కాగా ఇటీవల మెదడుకు సంబంధించిన ఇన్‌ఫెక్షన్‌తో శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆసుపత్రిలో కుటుంబ సభ్యులు చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు.

భవన నిర్మాణ సంఘ నాయకుడు..

భామిని, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరడి గ్రామానికి చెందిన భవన నిర్మాణ సంఘ నాయకుడు భీమసింగి రామారావు (65) మంగళవరం రాత్రి మృతిచెందాడు. అర్ధరాత్రి అనారోగ్యానికి గురైన రామారావును చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.నాలుగుదశాబ్దాలుగా మేస్త్రీగా పనిచేస్తున్నారు. ఎన్టీఆర్ సీఎంగా ఉన్న సమయం నుంచి టీడీపీ కార్యకర్తగా మంచి పేరు సంపాదించారు.